సాక్షి
అనంతపురం
సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



నల్ల తామర పురుగులకు చెక్

సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా మిరపలో నల్లతామరను అరికట్టవచ్చని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త తెలిపారు. 8లో



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్టంగా రూ.22 ప్రకారం పలికింది. అలాగే కనిష్టం రూ.4.50, సరాసరి రూ.10 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.7°/14.1°

జిల్లా అంతటా ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. కణేకల్లులో 37.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా శెట్టూరులో 14.1 డిగ్రీల కనిష్టం నమోదైంది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేటి 'స్పందన' రద్దు

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కొనసాగుతున్న నేపథ్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

గాడిదల సంతతి పెంపుపై 23న సదస్సు



అనంతపురం అగ్రికల్చర్: నానాటికీ తగ్గిపోతున్న గాడిదల సంతతిని పెంచేందుకు ఈ నెల 23న బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లిలోని ప్రాంతీయ పశు శాఖ శిక్షణ కేంద్రంలో జాతీయస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు కేంద్ర ప్రభుత్వం, బ్రూక్ హాస్పిటల్‌కు చెందిన ముగ్గురు ప్రతినిధులతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పశుసంవర్ధక శాఖ నోడల్ అధికారులు, రాయలసీమ జిల్లాల జేడీలు, అనిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్ ప్రతినిధులు, గుంటూరుకు చెందిన పలువురు గాడిద పెంపకందారులు హాజరవుతారన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రియాశీల కమిటీలు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్, ఫ్లయింగ్ స్క్వాడ్లు క్రియాశీలంగా పనిచేస్తాయి. అభ్యర్థులు నిర్వహించే ప్రచారం, ఎన్నికల కోడ్ అమలు తదితర అంశాలపై ఈ కమిటీలు నిఘా ఉంచుతాయి. ప్రతి అంశాన్నీ నిశితంగా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు నివేదికను జిల్లా ఎన్నికల అధికారికి పంపుతాయి. ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా ఈ కమిటీలు నిష్పక్షపాతంగా పనిచేయాల్సి ఉంటుంది.

ఎంసీసీ బృందాలు విధులివీ..

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటిస్తున్నారా లేదా అనే దానిపై మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) బృందాలు నిఘా ఉంచుతాయి. జిల్లా స్థాయిలో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఇక మండల, మునిసిపల్ స్థాయిల్లో మొత్తం 37 కమిటీలు నియమించారు. ఈ కమిటీలు అభ్యర్థులు, పార్టీలు ఎన్నికల నియమావళిని పాటిస్తున్నాయా లేదా అని పరిశీలిస్తాయి. అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాయి. ఎన్నికలకు విఘాతం కల్పించే వ్యక్తులపై చర్యలు తీసుకుంటాయి.

ఫ్లయింగ్ స్క్వాడ్ల పర్యవేక్షణ ఇలా..

ఎన్నికల సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం పనిచేస్తుంటాయి. వీడియోగ్రాఫర్‌తో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియోజకవర్గానికి ఒకటి నియమించారు. నిరంతరం నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తూ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచార విధానాలను పరిశీలిస్తాయి. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకునే పరిస్థితులుంటే గుర్తించి జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం చేరవేస్తాయి.

పరాకాష్టకు ఫీ'జులుం'

- హితేష్ అనే విద్యార్థి నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. 'చైనా' బ్యాచ్ అని, 24 గంటలూ ఏసీ అని రూ.90 వేలు ఫీజు కట్టించుకుంటున్నారు. పుస్తకాలకు మరో రూ.15 వేలు వసూలు చేశారు. హాస్టల్‌కు నెలకు రూ.5 వేల చొప్పున కట్టించుకున్నారు.
- నారాయణ కళాశాలలో నర్మద అనే విద్యార్థినికి ఐఐటీ కోచింగ్ పేరుతో ఏడాదికి రూ.75 వేలు, హాస్టల్‌కు నెలకు రూ.5 వేలు చొప్పున కట్టాలని చెప్పారు. పుస్తకాలు, ప్రాక్టికల్స్ పేరుతో మరికొంత చెల్లించాలని ఒత్తిడి చేశారు. తలకు మించిన భారం కావడంతో తల్లిదండ్రులు రెండు నెలల క్రితం నారాయణ కళాశాలలో టీసీ తీసుకుని.. కూతురిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్చారు.
- నారాయణ విద్యా సంస్థల్లో ముందస్తుగా అడ్మిషన్లు చేయడానికి పీఆర్వోలను నియమించుకున్నారు. ముందుగా చేరితే ఫీజుల రాయితీ ఇస్తామని అడ్మిషన్లు చేయించుకుంటున్నారు. జెడ్ఎఫ్‌బీ, ఎన్120, కోస్పార్క్ అని ఆకర్షణీయమైన పేర్లు పెట్టి స్టడీ మెటీరియల్‌పై అమాంతంగా ఫీజులు పెంచుతున్నారు.



అనంతపురం నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీ ఇటీవల కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఫీజు మొత్తం కడితేనే రికార్డులు ఇస్తామని బెదిరించడంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తెలిపింది. ఫీజు కట్టలేదని అందరి ముందు అవమానించడం, క్యాంపస్ బయట నిల్చోబెట్టడం, రికార్డులు, హాల్‌టికెట్లు ఇవ్వబోమని బెదిరించడం కార్పొరేట్ కళాశాలల్లో షరామామూలవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భవ్యశ్రీ లాంటి విద్యార్థినులు ఎంతోమంది అర్ధంతరంగా చదువులు మానేయడం.. ప్రాణాలు తీసుకునేందుకు ప్రయత్నించడం వంటివి చేస్తున్నారు.

నిబంధనల ఉల్లంఘన

- చెలరేగిపోతున్న కార్పొరేట్ కళాశాలలు
- అధికంగా కాలేజీ, హాస్టల్ ఫీజుల వసూలు
- సౌకర్యాల కల్పనలో విఫలం
- ఫీజుల ఒత్తిడి భరించలేని విద్యార్థులు
- అధిక ఫీజులకు కళ్లెం వేయలేకపోతున్న ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు

అనంతపురం: కార్పొరేట్ కళాశాలలు అడ్డగోలు సంపాదనకు తెరలేపాయి. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కన్నా అదనంగా వసూలు చేస్తున్నాయి. నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ కళాశాలల్లో అధిక ఫీజులు, వసూళ్ల కోసం వేధింపులు పరాకాష్టకు చేరుతున్నాయి. సూపర్ -20, ఐఐటీ తదితర కోర్సుల పేరుతో విచ్చలవిడిగా వసూలు చేస్తూ తల్లిదండ్రులపై విపరీతమైన భారం మోపుతున్నారు. విద్యార్థుల్లోనూ మానసిక ఒత్తిడి పెంచుతున్నారు. దీని నుంచి విద్యార్థులు బయటపడలేక అర్ధంతరంగా చదువు మానేయడం, ఆత్మహత్యకు యత్నించడం వంటి విపరీతమైన పరిస్థితులకు దారితీస్తోంది. కళాశాలలపై పర్యవేక్షణ చేయాల్సిన ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

హాస్టల్ ఫీజు ఏడాదికి రూ.60 వేలట!

నారాయణ కళాశాలలో ఒక్కో విద్యార్థికి హాస్టల్ ఫీజు రూ.60 వేలుగా నిర్ధారించారు. నెలకు రూ.5 వేల చొప్పున వసూలు చేస్తూ ఒక్కో గదిలో 10 మందిని కేటాయించారు. నాణ్యమైన భోజనం కూడా పెట్టడం లేదు. ఇదే విషయం ఇటీవల తనిఖీలో వెలుగు చూడటంతో జాయింట్ కలెక్టర్ జరిమానా విధించారు. ఒక్కో విద్యార్థికి ఇంటర్మీడియెట్‌లో ఫీజు రూ.20 వేలు దాటకూడదు. కానీ కార్పొరేట్ కళాశాలలు రూ.65 వేల నుంచి రూ.80 వేల దాకా వసూలు చేస్తున్నాయి. తెలుగు అకాడమీ పుస్తకాలు మాత్రమే చదవాల్సి ఉన్నప్పటికీ సొంత మెటీరియల్ పేరుతో మరో రూ.15 వేలు వసూలు చేస్తున్నారు. ఏడాదికి హాస్టల్ ఫీజు, కళాశాల ఫీజు మొత్తం రూ.1.50 లక్షలు తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారు. అంత డబ్బు చెల్లించుకోలేని వారు తమ పిల్లలను చదువు మాన్పిస్తున్నారు.

అన్నీ అద్దె భవనాలే..

నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఏ ఒక్క బ్రాంచ్‌కూ సొంత భవనాలు ఉండవు. అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల హవా నడిచినన్నాళ్లూ తల్లిదండ్రులను ముక్కుపిండి వసూలు చేసి.. అద్దె భవనాలు ఖాళీ చేసి వెళ్లిపోవచ్చుననే ఎత్తుగడతోనే కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

నారాయణ కళాశాల ఘటనకు సంబంధించిన సమగ్ర వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాం. అధిక ఫీజులు వసూలు చేస్తున్న అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.
– డాక్టర్ సురేష్‌బాబు, ఆర్ఐఓ, అనంతపురం

గజ వాహనంపై బుగ్గరామలింగేశ్వరుడు



తాడిపత్రి టౌన్: బుగ్గ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు ఆదివారం గజవాహనంపై పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వరుడు తాడిపత్రి పుర వీధుల్లో ఊరేగారు. అర్చకుల వేదమంత్రోచ్చారణ, వాయిద్యాల నడుమ ఆలయం నుంచి గాంధీ కట్ట, గానుగవీధి, పోలీస్‌స్టేషన్ రోడ్డు, సీబీ రోడ్డు, అశోక్ పిల్లర్, మెయిన్ బజార్ మీదుగా గ్రామోత్సవం సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఆంజనేయులు, కమిటీ సభ్యులు అంబటి రాఘవేంద్రారెడ్డి, హరిప్రసాద్, రమేష్, భగీరథమ్మ, ప్రధాన అర్చకులు మహేష్‌స్వామి, రవిశర్మ, శంకరశర్మ, గిరిశర్మ, నందుశర్మ, శివమాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

23న జిల్లా జైల్లో వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి వద్దనున్న జిల్లా జైలులో ఈ నెల 23న సాయంత్రం 4 గంటలకు వేరుశనగ చెక్క వేలం వేయనున్నట్లు సూపరింటెండెంట్ రెహ్మాన్ తెలిపారు. 20వేల కిలోల వేరుశనగ చెక్క ఉందని, ఆసక్తి ఉన్నవారు రూ.17వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ముగిసిన శివరాత్రి మహోత్సవాలు



అలంకరణలో మల్లీశ్వరస్వామి

కంబదూరు: మండల కేంద్రం కంబదూరులోని ప్రాచీన మల్లీశ్వరస్వామి దేవాలయంలో వారం రోజులుగా జరుగుతున్న 58వ శివపంచాక్షరి మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తర్వాత ఆలయ ధర్మకర్త మల్లూరి వెంకటేశులు, సుజాత దంపతులు కోనేరులో గంగపూజ చేశారు. వైస్ ఎంపీపీ భీమేష్, కవిత దంపతులు, బాగేపల్లి వసంతరాయుడు, పద్మావతి దంపతులతో అఖండ జ్యోతిని కదిలించడంతో ఉత్సవాలు ముగిశాయి.



కోనేరులో చివరిరోజు గంగపూజకు హాజరైన భక్తులు



అనంతపురం ఆర్ట్స్ కళాశాల వద్ద అభ్యర్థుల సందడి



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారి

సజావుగా ఎస్ఐ రాత పరీక్షలు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: ఎస్ఐ ఉద్యోగాలకు సంబంధించి రాత (ప్రిలిమినరీ) పరీక్షలు ఆదివారం సజావుగా జరిగాయి. అనంతపురం రేంజ్ పరిధిలో అనంతపురం, తిరుపతి రీజియన్లలోని 41 కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత నడుమ పరీక్షలు నిర్వహించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని డీఐజీ ఎం.రవిప్రకాష్, ఎస్పీ ఫక్కీరప్ప పరిశీలించారు. అనంతపురం రీజియన్‌లో 13,423 మంది అభ్యర్థులకు 20 పరీక్ష కేంద్రాలు, తిరుపతిలో 15 వేల మంది అభ్యర్థులకు 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్పీ ఫక్కీరప్ప మాట్లాడుతూ అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామన్నారు. అనధికార వ్యక్తులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. జిరాక్స్ సెంటర్లు మూసివేయించామన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలు, రూట్లను సమన్వయం చేసుకుని డీఎస్పీల నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు తిరుగుతూ మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరగకుండా పర్యవేక్షించాయన్నారు. సాయంత్రం 5:30 గంటలతో ఈ పరీక్షలు ముగిశాక ఆ పత్రాలు స్ట్రాంగ్ రూంలకు తరలించామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇ.నాగేంద్రుడు, డీఎస్పీలు జి.ప్రసాద్‌రెడ్డి, ఎస్.మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు వెళ్తున్న డీఐజీ, ఎస్పీ

ఓటమి గెలుపునకు తొలి మెట్టు



జిల్లా న్యాయమూర్తులతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టు దేవానంద్

అనంతపురం: ఓటమి అనేది గెలుపునకు తొలి మెట్టులాంటిదని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భట్టు దేవానంద్ అన్నారు. ఆదివారం అనంతపురం కోర్టులో జిల్లా స్థాయి న్యాయ సదస్సు నిర్వహించారు. అంతకుముందు బార్ అసోసియేషన్ నూతన భవనంలో జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులను ఉద్దేశించి ముఖ్య అతిథిగా జస్టిస్ భట్టు దేవానంద్ మాట్లాడారు. బార్ అసోసియేషన్ స్టేట్ మెంబర్‌గా రెండో దఫా పోటీ చేసిన సమయంలో తాను ఒక్క ఓటు తేడాతో ఓటమి పాలయ్యానన్నారు. అప్పుడు ఓటమి పాలవడం వల్లే హైకోర్టు జడ్జి అయ్యే అవకాశం వచ్చిందని గుర్తు చేశారు. ఎవరైనా బార్ అసోసియేషన్‌లో ఓటమి పాలు అయితే బాధపడరాదని, ఎన్నికలు ముగిశాక అందరూ సోదరభావంతో మెలగాలని అన్నారు. తాను ఇప్పటి వరకు రాజ్యాంగబద్ధంగా, నిష్పక్షపాతంగా తీర్పులు వెలువరించానన్నారు. తీర్పు వెలువరించినపుడు ఒక వర్గం వారికి అన్యాయం, మరో వర్గం వారికి న్యాయం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో అన్యాయం జరిగిన వారు అలజడి సృష్టిస్తారని, న్యాయవాదులు తమ కక్షిదారుల పట్ల వాస్తవాలు చెప్పి విశ్వాసాన్ని పెంపొందించేలా వ్యవహరించాలని సూచించారు. కోర్టుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. త్వరలోనే న్యాయస్థానాల్లో ఖాళీలు భర్తీ అవుతాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. అంతకుముందు జస్టిస్ భట్టు దేవానంద్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, పోలీసుల గౌరవవందనంతో ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్

- మార్చి 15 నుంచి థియరీ పరీక్షలు
- జిల్లాలో 83 కేంద్రాల్లో ప్రాక్టికల్స్, 60 కేంద్రాల్లో థియరీ పరీక్షలు
- పరీక్షలకు 41,186 మంది దరఖాస్తు



అనంతపురం: ఇంటర్మీడియెట్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. ఈ ఏడాది నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 20 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 15న ఎథిక్స్, అండ్ హ్యూమన్ వాల్యూస్, అనే సబ్జెక్టులపై ఇప్పటికే పరీక్ష నిర్వహించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా ఈ పరీక్ష ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. అలాగే ఈ నెల 17న ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ పరీక్ష జరిగింది. ఈ రెండు పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించారు. తాజాగా ప్రాక్టికల్స్ పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్నారు. మార్చి 7 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. అనంతపురం జిల్లాలో 83 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ప్రాక్టికల్స్ పరీక్షలు పూర్తయిన వారం రోజుల తరువాత మార్చి 15 నుంచి థియరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం 60 కేంద్రాల్లో థియరీ పరీక్షలు జరగనున్నాయి.

నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్..

పరీక్షల్లో భాగంగా ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఈ నెల 20 నుంచి వీరికి ప్రాక్టికల్స్ ప్రారంభమై వచ్చే నెల 7తో ముగుస్తాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు , మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయి. పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే సీసీ కెమెరాలన్నింటినీ ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. అలాగే ప్రతి కేంద్రాన్ని సెల్‌ఫోన్ రహిత జోన్‌గా ప్రకటించారు.

అధ్యాపకులకు జంబ్లింగ్..

ప్రాక్టికల్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు నాన్ జంబ్లింగ్ అమలు చేస్తుండగా, అధ్యాపకులకు మాత్రం జంబ్లింగ్ విధానం అమలు చేస్తున్నారు. ఒక కళాశాలలో ఎగ్జామినర్‌గా విధులు నిర్వర్తించిన వారికి రెండో రోజు ఏ కళాశాలకు వెళ్లాలన్న సమాచారాన్ని అధికారులు గంట ముందు మాత్రమే ఇస్తారు. తద్వారా అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం..

పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లాగిన్‌లో ప్రాక్టికల్ పరీక్షల ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. పరీక్ష నిర్వహించే అరగంట ముందు మాత్రమే సైట్ ఓపెన్ చేసి పాస్‌వర్డ్ ద్వారా ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసి, విద్యార్థులకు అందించాల్సి ఉంటుంది. వెబ్‌సైట్ ఓపెన్ చేసే సమయంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ఇంటర్మీడియెట్ విద్యార్థుల వివరాలు	
మొదటి సంవత్సరం	
రెగ్యులర్	17,319
ఒకేషనల్	1280
మొత్తం	18599
రెండో సంవత్సరం	
రెగ్యులర్	20,977
ఒకేషనల్	1610
మొత్తం	22,587

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నాం.
– సురేష్ బాబు, ఆర్ఐఓ, అనంతపురం

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

గుమ్మఘట్ట: గ్యాస్ సిలిండర్ పేలడంతో ఓ ఇల్లు ధ్వంసమైంది. స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధిలోని బేలోడు గ్రామానికి చెందిన మారికనమ్మ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ సొమ్ముతో జీవనం సాగిస్తుంది. ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నా వేరుగా నివాసం ఉంటోంది. కొత్తగా భారత్ గ్యాస్ కనెక్షన్ తీసుకున్నారు. గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది మారికనమ్మ ఇంట్లో స్టవ్‌తో పాటు సిలిండర్ అమర్చి వెళ్లారు. స్టౌవ్‌పై టీ పెట్టడానికి వెళ్లి లైటర్‌తో ఆన్ చేసింది. ఒక్క సారిగా మంటలు చెలరేగడంతో మారికనమ్మ గట్టిగా అరుస్తూ బయటకు వచ్చింది. మంటల్లో మారికనమ్మ గాయాలపాలైంది. చికిత్స నిమిత్తం స్థానికులు రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఇంటి పైకప్పు ధ్వంసమైంది. నిత్యావసర సరుకులతో పాటు రూ.45 వేల నగదు కాలిబూడిదైంది.

హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లు: రాష్ట్ర ప్రభుత్వం హజ్ కమిటీ ద్వారా ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ హజ్ కమిటీ సమన్వయకర్త అల్ హజ్ ముల్లా మస్తాన్‌వలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా మార్చి 10లోగా దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. ఈ ఏడాది దరఖాస్తుకు ఎలాంటి రుసుము లేదని తెలిపారు. దరఖాస్తుదారుల పాస్‌పోర్ట్ గడువు ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు ఉండాలని సూచించారు. ఈ ఏడాది హజ్ యాత్రికులకు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గన్నవరం, విజయవాడ ఎయిర్‌పోర్ట్‌ల నుంచే హజ్ యాత్రకు బయలుదేరుతారు. వివరాలకు 8639090056,9703365881 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సంతల ద్వారా రూ.2.33 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రూ.2.33 లక్షలకు పైగా ఫీజు వసూలైనట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.1,74,370 కాగా, ఆదివారం పశువుల సంత ద్వారా రూ.59,450 మేర ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

సమగ్ర యాజమాన్యంతోనే...

మిరపలో నల్ల తామర పురుగులకు చెక్

- కళ్యాణదుర్గం కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ చెండ్రాయుడు



కళ్యాణదుర్గం: మన రాష్ట్రంలో మిరప పంటను ప్రధానమైన వాణిజ్య పంటగా సుమారు 1.84 లక్షల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. దేశంలోనే ఏపీ మిరప సాగులో మొదటి స్థానంలో ఉంది. ఈ పంటను వాడుక భాషలో 'ఎర్ర బంగారం' గా పిలుస్తారు. సహజ సిద్ధమైన రంగులో ఉన్న మిరప పంట ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గిరికీ ఉండటంతో మిరప సాగులో భారతదేశం గణనీయమైన ప్రగతిని సాధిస్తోంది. దీంతో ఏపీ మిరపకు దేశీయ స్థాయిలో భారీ డిమాండ్ పెరిగింది. మిరప పంట సాగులో అధికంగా ఎరువులను, పురుగు మందులను వాడటం అతి సాధారణం. అలాగే పంటను ఆశించే చీడపీడలు చాలా ఎక్కువే. అయితే ఇటీవల కాలంలో మిరప పంటను ఆశిస్తున్న నల్ల తామర పురుగు మిరప రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇలాంటి తరుణంలో మిర్చి రైతులకు బాసటగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చెండ్రాయుడు రైతులకు పలు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

విదేశీ తామర పురుగుతో అధిక నష్టం..

ఇటీవల మిరపను ' త్రిప్స్ పార్విస్పినస్' అనే విదేశీ తామర పురుగు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో విస్తరించి రైతులకు తీవ్ర నష్టాన్ని కలగజేస్తోంది. ఈ జాతి తామర పురుగు 2015వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా బొప్పాయిపై శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ పురుగు పంటను ఆశించే తామర పురుగులు స్కిర్టోత్రిప్ డార్సాలిస్ లాగా కాకుండా రంగులోనూ, పరిమాణం లోనూ, పంటకు నష్టపరుస్తున్న మార్పులను శాస్త్రవేత్తలు గమనించారు. అనంతరం మిరప పంటపై సాధారణంగా ఆశించే తామర పురుగులు గోధుమ రంగులో ఉండి ఆకుల అడుగు భాగంలో గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయి. దీనివల్ల ఆకులపై మడతలు ఏర్పడి ఆకుల అంచుల నుండి లోపలికి ముడుచుకుని పోతాయి. కానీ ఈ కొత్త రకపు తామర పురుగుల పిల్ల పురుగులు లేత పసుపు లేదా గోధుమ వర్ణంలో ఉండి తల్లి పురుగులు పెద్దవిగా నలుపు రంగులో ఉంటాయి. అలాగే పంట మీద ఆశించినప్పుడు ఈ పురుగు మొక్కను గాయపరచడం గమనిస్తే అవి ఆకులపై, పూతలో ఎక్కువ సంఖ్యలో ఉండి పత్ర హరితాన్ని విపరీతంగా గీకి వేయడం, వాటి 15 నుంచి 33 గ్రుడ్లను ఆకుల కింది భాగంలో లోపలికి చొప్పించడం వల్ల ఆకులు పత్ర హరితాన్ని కోల్పోతాయి. ఇటుక రాయి రంగులో మారి సూర్యరశ్మి కాంతిలో మెరుస్తూ ఉంటాయి. పూతను ఆశించిన పురుగులు పుప్పొడిని తిని వేయడం, పూత భాగాలను గీకి వేయడం ద్వారా పూత కణజాలం దెబ్బతిని గోధుమరంగు చారలు ఏర్పడి పూత రాలిపోతోంది. కాయల మీద ఇటుక రంగు గజ్జి చారలు ఏర్పడి కాయలు గట్టిగా తయారయ్యి మార్కెట్ విలువ తగ్గిపోతోంది. రైతులు నల్లి పురుగులుగా భావించి ఈ కొత్త రకపు తామర పురుగుల నివారణకు విచక్షణ రహితంగా పురుగు మందులను వాడి ఖర్చు పెంచుకోవడం, దీనివల్ల తామర పురుగులను తినే సహాయ శత్రువులు చనిపోవడమే కాక పురుగు మందులు తట్టుకునే నిరోధక శక్తి పెరిగి వాటిని నివారించడం కష్టం అవుతుంది.





మిరప పువ్వుకు ఆశించిన నల్ల తామర పురుగు, నల్లబారిన మిరప ఆకులు

సమగ్ర యాజమాన్య పద్ధతులు

- లోతు దుక్కులు చేసుకోవడం ద్వారా తామర పురుగును నిద్రావస్థ దశలోనే నిర్మూలించవచ్చు.
- వయ్యారిభామ, తుత్తర బెండ, ముళ్ల వంగ వంటి కలుపు మొక్కలు పంట పొలంలో లేకుండా చేసుకోవాలి.
- ఎకరానికి 200 కిలోల వేప పిండి, 500 కిలోల వానపాముల ఎరువులను వాడటం వల్ల మొక్కలకు వ్యాధి నిరోధక శక్తి పెంచవచ్చు.
- మెటరైజియమ్ అనిసోప్లిన్ లేదా సుడోమనస్ ఫ్లోరెసెన్స్ 2 కిలోల చొప్పున ఒక టన్ను పశువుల ఎరువును కలుపుకుని మోతాదు మేరకు 10 నుంచి 12 టన్నుల పశువుల ఎరువును భూమిలో కలియదున్నాలి.
- ఇమిడాక్లోప్రిడ్ 10 గ్రాములు/ 1 కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి.
- భూసార పరీక్ష ఆధారంగా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను సమపాలల్లో సమయానికి అనుకూలంగా అందించాలి.
- రక్షక పైరుగా 2–3 వరుసల జొన్న లేదా మొక్క జొన్న వంటి వాటిని విత్తుకోవాలి.
- నీలిరంగు జిగట అట్టలను 25 నుండి 30 ఎకరానికి ఏర్పాటు చేసుకోవాలి.
- ముడత ఎక్కువ ఆశించిన మొక్కలను వేళ్ళతో పెకిలించి తగలబెట్టాలి.
- వేప గింజల కషాయం 1000 పీపీఎం 2 మి.లీ లేదా కానుగ నూనె 3 మి.లీ లేదా జీవ కిటక నాసినులైన బవేరియా బెసియానా 4 మి.లీ లేదా లెకానిసిల్లియమ్ లెకాని 4 మి.లీ లేదా సుడోమోనస్ ఫ్లోరోసిన్స్ 20 గ్రాములు లీటరు నీటిని కలిపి మొక్క అంతా తడిచేలా పిచికారీ చేయాలి.
- మొక్కలపై విష ప్రభావాన్ని నివారించడానికి పూత, పిందె రాలటాన్ని తగ్గించడానికి రైతులు నిర్దిష్ట పురుగు మందులను శాస్త్రవేత్తల సలహాల మేరకు మాత్రమే ఉపయోగించాలి.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్





క్రీడాకారుల నుంచి వందనం స్వీకరిస్తున్న అధికారులు, క్రీడాజ్యోతి వెలిగిస్తున్న అర్బన్ సీఐ, తదితరులు

- రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు అట్టహాసంగా ప్రారంభం

ఉరవకొండ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉరవకొండలోని పోలీసు క్రీడా మైదానంలో అండర్ - 14, అండర్ - 17 సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి బాలబాలికల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పది జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అర్బన్ సీఐ హరినాథ్ పతాకావిష్కరణ చేసి.. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి క్రీడా జ్యోతి వెలిగించారు. ఎంఈఓ ఈశ్వరప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఏపీ స్కూల్‌గేమ్స్ కార్యదర్శులు రవికుమార్, అంజన్న, సెపక్‌తక్రా సంఘం జిల్లా చైర్మన్ సప్తగిరి మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఉరవకొండ వేదిక కావడం ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. అనంతరం 'అమ్మ తొలి దైవం' సంస్థ అధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రమేష్‌బాబు, పీడీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, సహాయ కార్యదర్శి సిరాజుద్దీన్, జిల్లా కార్యదర్శి మురార్జీయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మారుతీప్రసాద్, పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

శివరాత్రి.. ఆ కుటుంబానికి కాళరాత్రి !

- నీటి కుంటలో పడి బాలుడు మృతి



యశ్వంత్ (ఫైల్)

కళ్యాణదుర్గం: మహాశివరాత్రి.. ఓ కుటుంబానికి కాళరాత్రిగా మారింది. చిన్నారులతో జాగారం చేసిన ఓ బాలుడు నీటికుంటలో పడి మృత్యువాత పడిన సంఘటన కళ్యాణదుర్గం మండలం బోయలపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... బోయలపల్లికి చెందిన సురేష్, శిల్పలకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వరుణ్ కర్నూలులో ఇంటర్ చదువుతుండగా, చిన్న కుమారుడు యశ్వంత్ (13) కళ్యాణదుర్గం పట్టణంలోని గోల్డెన్ బెల్స్ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. శివరాత్రి పండుగ సందర్భంగా తోటి స్నేహితులతో కలిసి శనివారం రాత్రంతా శివుని చిత్రపటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. జాగారం చేయాలన్న సంకల్పంతో శివనామ స్మరణ చేస్తూ రాత్రంతా భజన బృందాల వద్దే గడిపారు. తెల్లారుతుండగా శివుని చిత్ర పటాన్ని గ్రామ సమీపంలోని నీటి కుంటలో నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. అయితే అందరితో పాటు వెళ్లిన యశ్వంత్ శివుని చిత్రపటం పూర్తిగా నీట మునిగిందో లేదనని మరింత లోతులోకి వెళ్లాడు. అయితే లోతు గుంతల్లో నీరు అధికంగా ఉండటంతో ఈత రాక మునిగిపోయాడు. గమనించిన తోటి స్నేహితులు ఎంత సేపటికి యశ్వంత్ బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

హుటాహుటిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నీటి కుంట వద్దకు వెళ్లి గాలించగా విగత జీవిగా యశ్వంత్ నీటిలో తేలియాడుతూ కనిపించాడు.

ఎంత పని చేశావు శివయ్యా...

రాత్రంతా మాతో సంతోషంగా ఉన్నావు కదరా ... జాగారం చేస్తానన్నావు... తెల్లారగానే మమ్మల్ని వదిలి శివుడి దగ్గరకు వెళ్లిపోయావా.. యశ్వంతు అంటూ బాలుడి తల్లి శిల్ప, కుటుంబ సభ్యులు, బంధువులు మృత దేహంపై పడి కన్నీరు మున్నీరు కావడం అందరినీ కలచి వేసింది. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు కళ్ళెదురుగా మృతి చెందడం ఆ తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోయారు. శివయ్యా... ఎంత పని చేశావయ్యా.... మేము ఏం పాపం చేశామంటూ...రోదించడం అక్కడి వారందరినీ కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో బాలుడిని చూసేందుకు తరలివచ్చారు.

వెటరన్ క్రికెట్ టోర్నీ విజేత విజయవాడ

- రన్నరప్‌గా నిలిచిన అనంతపురం జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విన్సెంట్ ఫెర్రర్ వెటరన్ క్రికెట్ టోర్నీ విజేతగా విజయవాడ జట్టు నిలిచింది. ఆదివారం స్థానిక అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన క్రీడా మైదానంలో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం జట్టు పై 39 పరుగులతో విజయవాడ వెటరన్ జట్టు విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. రన్నరప్‌గా అనంతపురం వెటరన్ జట్టు ట్రోఫీని అందుకుంది. టాస్ గెలిచి అనంతపురం వెటరన్ జట్టు మొదట ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసింది. జట్టులో ప్రసాద్ 37, లెనిన్ 42, జ్వాలా చౌదరి 32 పరుగులతో రాణించారు. అనంతపురం జట్టు బౌలర్లలో షాబుద్దీన్ 2, గులాం ఖాదీర్‌బాషా, ఇనాయతుల్లాలు చెరో వికెట్‌ను సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులు మాత్రమే చేసింది. జట్టులో ప్రదీప్ 41, జీ ప్రదీప్ 16, నాగప్ప 11 పరుగులతో రాణించారు. విజయవాడ జట్టు బౌలర్లలో శ్రీకాంత్ 3, లెనిన్, సంజయ్‌లు చెరో 2 వికెట్లు సాధించారు. దీంతో విజయవాడ జట్టు 39 పరుగులతో విజయం సాధించింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆర్డీటీ సీబీఆర్ డైరెక్టర్ రఫీ, సెబ్ సీఐ నాగేంద్రప్రసాద్, రవికాంత్ క్యాటరర్స్ రమణ ముఖ్య అతిథులుగా హాజరై ట్రోఫీలను అందజేశారు.



అనంతపురం జట్టు సభ్యులు

హరహర మహాదేవ



వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవంలో భక్తజన కోలాహలం, (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తులను పల్లకిలో తీసుకొస్తున్న దృశ్యం

లేపాక్షి: వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవాన్ని పురస్కరించుకుని శివనామస్మరణతో ఆదివారం లేపాక్షి మార్మోగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఉత్సవంలో హరహర మహాదేవ శంభోశంకర, ఓం నమఃశివాయ నినాదాలు మిన్నంటాయి. ముందుగా శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహ మూర్తి పర్యవేక్షణలో సునీల్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా హోమాలు చేపట్టిన అనంతరం స్వామికి మహామంగళహారతి ఇచ్చి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి బస్టాండులో ఉన్న బ్రహ్మ రథం వరకూ పల్లకీ సేవతో తీసుకొచ్చారు. రథంలో శివపార్వతులను ఆసీనులను గావించి ఉత్సవాన్ని ప్రారంభించారు. అశేష జన వాహిని నడుమ రథోత్సవం భజన మందిరం వరకూ వేడుకగా సాగింది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. సాయంత్రం ధూళోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రథోత్సవంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ మునీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నారాయణస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కేపీ కళాకారులకు జాతీయ పురస్కారాలు



పురస్కారమందుకుంటున్న ఎల్కేపీ కార్యదర్శి పద్మజ

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన లలితకళాపరిషత్తు కళాకారులు జాతీయ పురస్కారాలనందుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా హొస్పేట నగరంలో జాతీయ నృత్యోత్సవాలు జరిగాయి. నేషనల్ డాన్సు అకాడమీ ప్రతినిధులు వివిధ ప్రాంతాలకు చెందిన వారికి జాతీయ కళాపురస్కారాలను అందించారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన సామాజిక సేవా విభాగంలో లలితకళాపరిషత్తు కార్యదర్శి పద్మజకు , స్టేజి ఆర్టిస్టులుగా రామగోవిందసాగర్, సుబ్బారావులకు జాతీయ పురస్కారాలనందించారు. నిర్వాహకులు కోలా వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణభట్ అనంత వాసులకు శ్రీకృష్ణదేవరాయల ప్రతిమలతో పాటూ ప్రశంసాపత్రాలిచ్చి సత్కరించారు. జాతీయ పురస్కారాలనందుకున్న వారిని ఎల్కేపి కార్యవర్గ సభ్యులు ఘనంగా అభినందించారు.

డాక్టర్ రాధేయకు జీవిత సాఫల్య పురస్కారం



అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన సీనియర్ కవి డాక్టర్ రాధేయ ప్రతిష్టాత్మక అమృతలత జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకులు అమృతలత ఆ వివరాలనందించారు. యాభై ఏళ్లుగా కవిగా అనేక పుస్తకాలను తెచ్చిన రాధేయ మూడు దశాబ్దాలుగా ఉత్తమ కవిత్వాన్ని ప్రోత్సహించడానికి ఉమ్మడిశెట్టి రాధేయ అవార్డులనందిస్తున్నారు. ఆయన చేస్తున్న సాహితీ సేవలకు గాను వచ్చేనెల 5న నిజామాబాద్‌లో జరిగే సాహితీ పురస్కార ప్రదానోత్సవంలో ఆయనకు అవార్డు కింద రూ. 25 వేల నగదు బహుమతినిచ్చి ప్రముఖుల చేతుల మీదుగా ఘనంగా సత్కరిస్తామన్నారు. కొత్త ఏడాదిలో జిల్లా కవికి గొప్ప సాహితీ పురస్కారం రావడంపై పలు సాహితీ సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

విమలాశాంతి సాహిత్య పురస్కారం ప్రదానం



విమలాశాంతి పురస్కారాన్ని అందుకుంటున్న మేఘనాథరెడ్డి

అనంతపురం కల్చరల్: వర్ధమాన యువరచయిత మేఘనాథరెడ్డి కథలు ఆద్యంతం అందమైన పల్లెజీవితాన్ని ప్రతిబింబిస్తూనే సమస్యలను సమర్థవంతంగా ఎత్తి చూపుతాయని పలువురు వక్తలు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో చిత్తూరు జిల్లాకు చెందిన మేఘనాథరెడ్డి 'కాలంకూరి కథలు' సంకలనానికిగాను విమలాశాంతి సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు. మానవత వ్యవస్థాపకులు తరిమెల అమరనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా శాంతినారాయణ, వెంకటకృష్ణ, ఉప్పరపాటి వెంకటేశులు, అనువాద రచయిత శొంఠి జయప్రకాష్ , శశికళ తదితరులు మాట్లాడుతూ యువ రచయిత మేఘనాథరెడ్డి చిన్నవయసులోనే సాహిత్యంలో అందరిని ఆలోచింపజేసే విధంగా కథలను ముఖ్యంగా ఆ ప్రాంతాల యాసను అద్భుతంగా ఆవిష్కరిస్తున్నారని కొనియాడారు. ఆధునిక కథా లక్షణాలను కూడా ఉండేలా చూసుకుంటే ఎంతో ఎత్తుకు ఎదిగే గొప్ప భావుకుడిని సాహితీలోకం చూస్తుందన్నారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన పలువురు రచయితలు, కవుల చేతుల మీదుగా మేఘనాథరెడ్డికి పురస్కారంతో పాటూ రూ.5 వేల నగదు, జ్ఞాపికనిచ్చి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- టీడీపీ నాయకుడిని తప్పించేందుకు పోలీసుల యత్నం?



మృతిచెందిన నందకిశోర్

చెన్నేకొత్తపల్లి: తెలుగుదేశం పార్టీ నాయకుడు, ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత అలిమినేని సురేంద్రబాబుకు చెందిన కారు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన జాతీయ రహదారి 44పై చెన్నేకొత్తపల్లిలో చోటుచేసుకోంది. స్థానికుల వివరాలమేరకు.. చెన్నేకొత్తపల్లికి చెందిన నందకిశోర్ (18) ఆదివారం ఎన్ఎస్ గేటు వైపు నుంచి చెన్నేకొత్తపల్లికి వస్తుండగా అనంతపురం నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత వాహనం వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంలో వెళ్తోన్న నందకిశోర్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం 108లో అనంతపురానికి తరలిస్తుండగా మృత్యువాతపడ్డాడు. ప్రమాదం చేసిన టీడీపీ నాయకుడిని తప్పించేందుకు స్థానిక పోలీసులు బేరసారాలు పెట్టినట్లు సమాచారం.

తాతపై దాడిచేసిన మనవడు

కూడేరు: మద్యం మత్తులో కత్తి (మటన్ నరికే)తో తాతపై మనవడు విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన కూడేరులోని అనంత వెంకటరెడ్డి కాలనీలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. దూదేకుల పెద్ద కాసన్నది మండల పరిధిలోని పి.నాగిరెడ్డిపల్లి. అనంత వెంకటరెడ్డి కాలనీలో కాపురముంటున్నాడు. ఆయనతో కలసి మనవడు బాబావలి ఉంటున్నాడు. అయితే బాబావలి తాగిన మైకంలో తాతతో ఘర్షణకు దిగి కత్తితో దాడి చేశాడు. క్షతగాత్రున్ని అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెద్ద కాసన్న పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు చెప్పారు.

చెత్త నిర్వహణకు పటిష్ట చర్యలు

- నగరపాలక సంస్థకు కొత్తగా మరో 20 క్లాప్ ఆటోలు
- ఇది వరకే 14 ఆటోలతో చెత్త సేకరణ
- రోజూ 125 టన్నుల చెత్త కంపోస్టు యార్డుకు తరలింపు


కొత్తగా వచ్చిన క్లాప్ ఆటోలు ఇవే


కంపోస్టు యార్డుకు చెత్తను తరలించేందుకు క్లాప్ ఆటోల నుంచి సేకరించిన చెత్తను కాంపాక్టర్‌లోకి నింపుతున్న దృశ్యం

అనంతపురం క్రైం: చెత్త రహితంగా నగరంగా మార్చేందుకు నగరపాలక సంస్థ పటిష్ట చర్యలు తీసుకుంటోంది. క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ లక్ష్యానికి చేరువయ్యేందుకు ప్రజారోగ్య అధికారులు కృషి చేస్తున్నారు. క్లాప్ ఆటోల ద్వారా చెత్త నిర్వహణను విజయవంతంగా చేస్తున్నారు. ప్రస్తుతం 14 ఆటోలతో నగరంలోని 16 సచివాలయాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చెత్తను సేకరించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు మరో 20 క్లాప్ ఆటోలు రావడంతో చెత్త సేకరణ మరింత సులువుకానుంది. నగరంలో మొత్తం 50 డివిజన్లలోని వివిధ ప్రాంతాల్లో క్లాప్ ఆటోలు, పుష్ కాట్లు, వాహనాల ద్వారా కంపోస్టు యార్డుకు రోజూ 125 టన్నుల చెత్త కంపోస్టు యార్డుకు వెళ్తోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 14 క్లాప్ ఆటోలు 7, 25, 26, 27, 28, 36 38, 39, 40, 44, 45, 46, 55, తదితర సచివాలయ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో తడి, పొడి, ప్రమాదకర చెత్తను మూడు విభాగాలుగా సేకరిస్తున్నాయి. 14 ఆటోల నిర్వహణకు సంబంధించి ప్రతి నెలా ఏజెన్సీకి ప్రభుత్వం రూ.8.72 లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. ఈ ఆటోల ద్వారా రోజూ 35 నుంచి 40 టన్నుల చెత్త ఆర్అండ్‌బీ అతిథి గృహం పక్కన ఉన్న చెత్త సేకరణ పాయింట్‌కు తరలించి, అక్కడి నుంచి కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. కొత్తగా మరో 20 క్లాప్ ఆటోలు రావడంతో రోజూ చెత్త సేకరణ పక్కాగా జరిగే అవకాశం లేకపోలేదు. రాణినగర్, అంబేడ్కర్‌నగర్, మున్నానగర్, వినాయకనగర్, భవానీనగర్, , నగర శివారు, తదితర ప్రాంతాల్లోనూ చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరగనుంది. ఈ ఆటోల ద్వారా మరో 40 టన్నుల నుంచి 50 టన్నుల వరకు చెత్తను తరలించొచ్చని నగరపాలక సంస్థ అధికారులు చెప్తున్నారు.

నగరపాలక సంస్థలో చెత్త సేకరణ వివరాలు

డివిజన్లు - 50
ఇళ్లు - 76,369
రోజూ ఉత్పత్తి అయ్యే చెత్త - 125 టన్నులు
క్లాప్ ఆటోలు మొత్తం - 34 (పాతవి, కొత్తవి కలుపుకుని)
ప్రస్తుతం ఉన్న క్లాప్ ఆటోలతో - 35 నుంచి 40 టన్నుల చెత్త సేకరణ
20 ఆటోలతో చెత్త సేకరణ అంచనా - 40 నుంచి 50 టన్నులు

చెత్త పారవేయొద్దు

చెత్త సేకరణ జరగలేదని ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకూడదు. మన ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో అదే భావనతో నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో అందరూ భాగస్వామ్యులవ్వాలి. కొత్తగా వచ్చిన క్లాప్ ఆటోలతో కలుపుకుని మొత్తం 34 వాహనాలున్నాయి. ఇళ్ల వద్దకు వచ్చే ఆటోలకు చెత్తను మూడు విభాగాలు వేరు చేసి ఇవ్వండి. నగర పరిశుభ్రతకు సహకరించాలి.

– మహమ్మద్ వసీం, మేయర్

కార్మికులకు తగ్గనున్న పనిభారం

క్లాప్ ఆటోల నిర్వహణతో నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులకు పని భారం తగ్గే అవకాశం ఉంది. నగరంలోని 50 డివిజన్లలోని ఆరు సర్కిళ్లలో అప్కాస్ కింద 404, రెగ్యులర్ 131, కోవిడ్ సమయంలో తీసుకున్న 70 మంది, మలేరియా 33 మంది(ఫాగింగ్, స్ప్రేయింగ్) సిబ్బంది రెండు షిఫ్టుల్లో విధులు నిర్వర్తించేవారు. పుష్‌కాట్లు, డస్ట్‌బిన్లు, 53 వాహనాల ద్వారా చెత్తను తరలించేవారు. ఇప్పుడలాంటి పరిస్థితి లేకుండా కేవలం రోడ్లు, కూడళ్లు, కాలువల్లో పూడిక తొలగింపుపై ప్రత్యేక దృష్టిసారించొచ్చు.

క్లుప్తంగా

ఉత్కంఠగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: బి.యాలేరులో శివరాత్రి వేడుకల్లో భాగంగా నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్కంఠగా సాగాయి. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, తోపుదుర్తి బ్రదర్స్ ఆర్థిక సహాయం అందించారు. పోటీలను పి.యాలేరు సొసైటీ బ్యాంక్ చైర్మన్ తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండుగ వాతావరణంలో ఇలా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు తోపుదుర్తి కుటుంబం అండగా ఉంటుందన్నారు. బెళుగుప్ప మండలానికి చెందిన గురు వృషభాలు రూ.40 వేలు మొదటి బహుమతి, ఆత్మకూరు మండలం తోపుదుర్తి చెన్నప్ప వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.30 వేలు, గోపాల్ వృషభాలు మూడో స్థానంలో నిలిచి రూ.20 వేలు, ఆత్మకూరు మండలం కుర్లపల్లికి చెందిన అక్కమ్మ వృషభాలు నాల్గో స్థానంలో నిలిచి రూ.10 వేలు, బండి అడ్డకూరప్ప వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.5 వేలు గెలుపొందాయి.

నేడు స్పందన

కనగానపల్లి: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ పీవీ రమణ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలన్నారు.

స్పందన రద్దు

అనంతపురం క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం జరిగే స్పందన కార్యక్రమం రద్దయినట్లు నగరపాలక సంస్థ వర్గాలు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు స్పందన ఉండదని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి మాఘమాస పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూల విరాట్‌కు ఆకుపూజ , పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మంజునాథ స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాహుకేతు హోమాలు నిర్వహించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

పెద్దపప్పూరు: అశ్వత్థ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. అశ్వత్థ నారాయణ స్వామి, గణపతి, శింగరబట్లు, శ్రీచక్రభీమలింగేశ్వర స్వాములకు ఉదయం నుంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి పవిత్ర పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పలుచోట్ల అన్నదానంతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు. పెన్నానదిలోని స్నానఘట్టాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా ఎస్ఐ ఖాజాహుస్సేన్ పర్యవేక్షించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం ఏర్పాట్లు ఏర్పాటు చేశారు.

వైభవం.. కోన రామలింగేశ్వరుడి రథోత్సవం

యాడికి: కోనుప్పలపాడు సమీపంలోని కోన క్షేత్రంలో రామలింగేశ్వరుడి తిరునాల్లో భాగంగా ఆదివారం స్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు నంద్యాల జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో కోన క్షేత్రానికి తరలివచ్చారు. ముందుగా ఆలయం ఎదురుగా ఉన్న నీటి గుండంలో స్నానమాచరించి కోన రామ లింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ అర్చకులు, కోనా బ్రదర్స్ ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి ఊరేగింపుగా తేరు వరకు తీసుకు వచ్చి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ అర్చకులు, కోనా బ్రదర్స్ వెంకటశివారెడ్డి, జగదీశ్వర రెడ్డి, దేవనాథ రెడ్డి, మోహన్‌రెడ్డి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు రామలింగేశ్వర స్వామి నామ స్మరణ చేస్తూ రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మార్మోగింది.

వేకువజామునే రామలింగేశ్వరుడి కల్యాణం

ఆదివారం వేకువ జామున 4 గంటలకు ఆలయ ఆవరణలో స్వామికి కల్యాణోత్సవాన్ని అర్చకులు పరమేశ్వర శర్మ కోనా జగదీశ్వర్‌రెడ్డి దంపతుల చేత జరిపించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. జిల్లావాసులేగాక, కర్ణాటక ప్రాంతవాసులు తరలివచ్చి కానుకలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న చిన్నారుల సృజన


చిన్నారులకు బహుమతి ఇస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: చిన్నారుల్లో అనేక కళలు దాగుంటాయని, వాటిని సమర్థవంతంగా వెలికి తీస్తున్న కత్తి విజయ్‌కుమార్ అభినందనీయులని డాక్టర్ హేమలత, ప్రముఖ సైకాలజిస్టు లహరి అన్నారు. కళాసాగర్ ఆధ్వర్యంలో డాన్స్‌మాస్టర్ కత్తి విజయ్‌కుమార్ ప్రతి ఆదివారం స్థానిక కృష్ణ కళామందిరం వేదికగా డాన్సులు, కరాటే, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర వాటిల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఉదయం జరిగిన పోటీల్లో నైనిక, ఐశ్వర్య, హేమ, మణితేజ, అస్మిత విజేతలుగా నిలిచి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులందుకున్నారు. అనంతరం డాక్టర్ హేమలతను, లహరిని చిన్నారులు, నిర్వాహకులు సత్కరించారు.

నయన మనోహరం.. బ్రహ్మ రథోత్సవం


రథోత్సవంలో కొలువుదీరిన పార్వతీ పరమేశ్వరుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డులోని శ్రీకాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో బ్రహ్మరథోత్సవం ఆదివారం రాత్రి కొనసాగింది. ఆదిదంపతుల బ్రహ్మ రథోత్సవం భక్తులను పరవశులను చేసింది. ఉదయం మడుగు తేరును నగర వీధుల్లో ఊరేగించారు. కాశీవిశ్వేశ్వరుడికి ఉదయం సుప్రభాత సేవలు, మహన్యాసం, ఏకవార రుద్రాభిషేకం, అర్చనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాత్రి పలు రకాల పూలతో అలంకరించిన పూలరథంపై పార్వతీ పరమేశ్వరులు పురవీధుల్లో ఊరేగి దర్శనమిచ్చారు. ఆదిదేవుడి బ్రహ్మరథోత్సవం పురవీధుల్లో కనుల పండువగా సాగింది. కళా రూపాల ప్రదర్శనలు, వేదమంత్రాల ఘోష్టి, భక్తుల శివ నామ స్మరణల నడుమ సాగిన రథోత్సవానికి భక్తులు అడుగడుగునా భక్తి నీరాజనాలర్పించారు. ఆలయంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు పనిభారం తగ్గించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం అర్బన్: ఏఎన్ఎంలకు అనవసర యాప్‌లు తొలగించి పనిభారం తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, ఏఎన్ఎం, ఆరోగ్య కార్యదర్శులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.లీలావతి అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సచివాలయ ఏఎన్ఎంల జిల్లా స్థాయి సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. యాడికి మండలం రాయలచెరువు పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, మహిళ ఉద్యోగులు దుస్తులు మార్చుకునే గదిలో రహస్యంగా సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు, వీడియో తీయించిన వైద్యుడు అప్పయ్యను తక్షణమే ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ పంచాయతీరాజ్, వైద్య, మున్సిపల్ శాఖలకు అనుసంధానంగా ఉండడంతో ఏఎన్ఎంలు సెలవు తీసుకోవడంలో ఇబ్బంది ఎదుర వుతోందన్నారు. ఏఎన్ఎంలు క్షేత్ర స్థాయి విధులు నిర్వస్తున్న కారణంగా వారికి మూడు సార్లు బయోమెట్రిక్ మినహాయింపు ఇవాలన్నారు. గ్రేడ్-3 నుంచి హెల్త్ అసిస్టెంట్‌లుగా మార్చాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, నాయకులు మల్లికార్జున, రాజు, ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర నాయకురాళ్లు పరిమళ, యాస్మిన్, రజని, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించాలి

ఆత్మకూరు: రైతులు వ్యవసాయ విద్యుత్ బిల్లు సకాలంలో చెల్లించి సహకరించాలని డీఈఈ (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) శ్రీనివాస్‌రెడ్డి రైతులను కోరారు. ఆదివారం మండలంలోని సనపలో ఆయన ఏఈ దాస్‌తో కలిసి అధిక మొత్తం బిల్లు పెండింగ్ ఉన్న రైతులను ఆయన కలిశారు. నగదు పెండింగ్‌లో ఉన్న రైతుల ట్రాన్స్‌ఫార్మర్ల జంబర్లను కట్ చేశారు.

ఆకట్టుకున్న ‘వీరబ్రహ్మేంద్రస్వామి’ నాటకం


నాటకంలోని ఓ సీను

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట ఆంజనేయస్వామి తోరణం వద్ద శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకు నిర్వహించిన వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర ఉచిత నాటకం ఆకట్టుకుంది. పోలీస్ లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాతకాలపు నాటకాన్ని తిలకించేందుకు పాపంపేట, విద్యారణ్యనగర్, గణేష్‌నగర్, కక్కలపల్లికాలనీ పంచాయతీ నుంచి ప్రజలు తరలివచ్చారు. బ్రహ్మయ్యగా ఎం.ఓబులేసు, 1,2వ సిద్ధయ్యగా వి.శ్రీరాములు, 3వ సిద్ధయ్యగా వి.ఆంజనేయులు, 4వ సిద్ధయ్యగా బెల్లంకొండ వెంకటరాముడు, గోవిందదాస్‌గా ఎం.చంద్రమౌళి, కక్కయ్యగా బెల్లంకొండ పోలన్న, పీరూసాబ్‌గా ఆంజనేయులు, వీరదాస్‌గా నాగప్ప, పోతులూరయ్యగా జి.నాగన్న, గోవిందమ్మగా అమరకుమారి పాత్రలు ధరించారు. కళాకారుల అభినయం ఆకట్టుకుంది. హార్మోనిస్టు సి.నాగరాజు, తబల శ్రీరాములు, క్లార్నెట్‌గా సి.నారాయణ వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీ కొని ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. కరిడికొండ గ్రామానికి చెందిన నరేష్, సాయి తేజ పని నిమిత్తం బైక్‌లో గుత్తికి వచ్చి తిరిగి గ్రామానికి బయలుదేరారు. గ్రామ సమీపంలో కర్నూలు వైపునకు వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు సాయి తేజను అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

గుత్తి రూరల్: మార్నేపల్లి క్రాస్ వద్ద 67వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దొడ్డి గ్రామానికి చెందిన నరేష్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం తరలిస్తున్నాడని సెబ్ పోలీసులకు సమాచారం అందింది. పక్కా సమాచారంతో మార్నేపల్లి క్రాస్ వద్ద కాపు కాచి నరేష్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి బైక్, 30 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నరేష్‌పై కేసు నమోదు చేశారు. ఎస్ఐ అలీ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

25న క్రికెట్ టోర్నమెంట్

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు గ్రామంలో ఈనెల 25న శనివారం రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసినట్లు ఆర్గనైజర్లు భాస్కర్‌రెడ్డి,తలారి రాజప్ప ఆదివారం తెలిపారు. విన్నర్ జట్టుకు రూ. 50,000, రన్నర్ జట్టుకు రూ.25,000 అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న జట్లు ఎంట్రీ ఫీజు రూ.1100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7675095575, 8247782884 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాయలసీమ బలిజ సంఘం ఆధ్వర్యంలో సక్షం సంస్థ నేతృత్వంలో స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీ బాలాజీ కళ్యాణమండపంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నగర డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, సక్షం అధ్యక్షులు వేణుగోపాల్, బలిజ సంఘం అధ్యక్షులు పామురాయి వెంకటేష్, వైద్యురాలు సుప్రజా చౌదరిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సక్షం జిల్లా కార్యదర్శి మల్లికార్జున, భాగ్యలక్ష్మి, లక్ష్మి, శ్రీధర్, పవన్, ఓంప్రకాష్, గౌతం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐచర్ వాహనం బోల్తా

పామిడి: స్థానిక అంబేడ్కర్ కాలనీ సర్కిల్ కూడలిలోని స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆదివారం ఐచర్ వాహనం బోల్తా పడింది. ఏఎస్ఐ మహమ్మద్ వలి తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం తుమకూరుకు చెందిన గౌడ్ ఐచర్ వాహనం దోసకాయ లోడ్‌తో హైదరాబాద్ నుంచి తమకూరుకు బయల్దేరింది. స్పీడ్ బ్రేకర్ల వద్ద అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పై బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు ఐచర్ వాహనాన్ని క్రేన్ సాయంతో తొలగించారు.

తెలుగు సాహిత్యానికి దిక్సూచి మహాప్రస్థానం



మాట్లాడుతున్న విశ్రాంత తహసీల్దార్ జయరామప్ప, నృత్యం చేస్తున్న బాలికలు

అనంతపురం: తెలుగు సాహిత్యానికి దిక్సూచిలా వెలుగొందిన కవితా సంకలనం శ్రీశ్రీ మహాప్రస్థానం అని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఆర్ట్స్ కళాశాల, అనంతపురంలో కామర్స్ బ్లాక్ వద్ద జరిగిన శ్రీశ్రీ సాహిత్య,సాంస్కృతిక ఉత్సవం సాహితీ స్రవంతి నాయకులు ప్రజ్ఞా సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి మాట్లాడుతూ 20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి, అభ్యుదయ భావాలతో జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విశ్రాంత తహసీల్దార్ జయరామప్ప, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏపీ నాగేంద్ర, విశ్వం విజ్ఞాన కేంద్రం నాయకులు ఎంఎంటీ రాజు, కవి రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం ఉండాలి

అనంతపురం టవర్‌క్లాక్: పేదలకు సేవ చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బాలాజీ కళ్యాణ మంటపంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి దాదాపు 200 మంది హాజరయ్యారన్నారు. వారిలో 49 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ

తాడిపత్రి టౌన్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా దక్షణ కాశీగా పిలువబడుతున్న బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జరగనున్న బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ఆదివారం చింతల వెంకటరమణస్వామి ఆలయ చైర్మన్ బానా నాగేశ్వరరెడ్డి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు మురళీస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పట్టువస్త్రాలను సమర్పించారు. స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో బుగ్గ ఆలయానికి చేరుకున్నారు. వారికి బుగ్గ ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, అర్చకులు, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం బానా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా శ్రీశైలం, కాణిపాకం, తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానాలకు పట్టువస్త్రాలను అందజేస్తున్నారని, ఈనేపథ్యంలో తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి కల్యాణానికి చింతల ఆలయం నుంచి పట్టువస్త్రాలను అందజేయడం గతేడాది నుంచి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో చింతల, బుగ్గ ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్రారెడ్డి, సంజన్న, భూమా హరి, లక్ష్మీదేవి, మధ్యాహ్నలత, రమాదేవి, భగీరథమ్మ, రమేష్ హరి ప్రసాద్, ఆలయ అర్చకులు మహేశ్వరశర్మ, శంకరయ్య, గిరిశర్మ, నందు శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మాధవరాజుల ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో మాధవరాజుల స్వామి

ఆత్మకూరు: మండలంలోని సనపలోని మాధవరాజుల పరుషలో భాగంగా ఈ నెల 21 నుంచి 27 వరకు పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 21న చెరుకు కొలనుకు తీసుకొచ్చి పూజలు నిర్వహించడం, 22న స్వామి ఊరేగింపు, 23న ఆలయం చుట్టూ పన్నేరపు బండ్ల ప్రదర్శన , 24న రథోత్సవం , 25న స్వామికి ప్రత్యేక అలంకరణ, 26న రాజుల స్వామిని సనపకు చేర్చడం, 27న మారుపూజతో ఉత్సవాలు ముగుస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. 25న సనపలో పరుష సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆర్థిక సహకారంతో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి గా రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాల్గో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతిగా రూ.5 వేలు ఇవ్వనున్నారు.

వైభవంగా మల్లేశ్వరస్వామి రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

కనగానపల్లి: కనగానపల్లిలోని అతకల్లపట్నం మల్లేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కనగానపల్లి, యలకుంట్ల, నెమలివరం గ్రామాల్లోని శివభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగింపు చేశారు. తర్వాతా గౌరవయ్యల పాలు పట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాలగొండ్ల వంశస్తులతో ఆడబిడ్డలకు వడిబియ్యం పెట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. యలకుంట్లలోని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.